క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

తిరుపతి తుడా: మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మార్ పల్లి పంచాయతీ ఆఫీసు వద్ద శివాలయంలో రష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని ప్రజలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

30 ఏళ్లుగా ఉన్న దారిని మూసేస్తారా ?



రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న శివజ్యోతినగర్ ప్రజలు

తిరుపతి మంగళం : గత 30 ఏళ్లుగా తిరుమల బైపాస్‌రోడ్డు నుంచి శివజ్యోతినగర్, జీవకోనకు రాకపోకలు సాగిస్తున్న దారిని మూసేస్తే తాము ఎలా వెళ్లాలంటూ స్థానిక ప్రజలు ప్రశ్నించారు. తిరుపతి నగర పరిధిలోని 45వ డివిజన్ శివజ్యోతి నగర్ ఎస్‌వీఎస్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం స్థానికులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ రోడ్డు మార్గంలో శివజ్యోతినగర్‌తో పాటు జీవకోనకు వేలాది మంది పాదచారులు, వాహనదారులు వెళ్తుంటారని వారు తెలిపారు. అయితే కార్పొరేషన్ అధికారులు రోడ్డుకు అడ్డుగా గోడ నిర్మిస్తే తమకు దారి ఎలా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ కాలనీకి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు కూడా వేశారని, ఇప్పుడు రోడ్డును ఎలా మూసివేస్తారంటూ ప్రశ్నించారు. గోడ కట్టే సమయంలో స్థానికులకు అధికారులకు మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొడవలు జరగకుండా చూశారు. భూయజమానులకు సంబంధించి హైకోర్టు ద్వారా తమకు వచ్చిన ఉత్తర్వుల మేరకు గోడ కట్టేందుకు రావడం జరిగిందని మున్సిపల్ కార్పొరేషన్ డీఈ రమణ స్థానికులకు తెలియజేశారు.

ప్రసాదాల పంపిణీ

తిరుపతి కల్చరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయం వద్ద రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



గౌసియా (ఫైల్)

చంద్రగిరి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని తొండవాడ జగనన్న కాలనీకి చెందిన సర్వర్ బాష ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు కుమార్తె గౌసియా, కుమారుడు ఉన్నాడు. బీఈడీ పూర్తి చేసిన గౌసియా ఇంటి వద్దే ఉంటూ టీచర్ ఉద్యోగం కోసం చదువుకుంటోంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గౌసియా కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో తిరుపతి రూరల్ మండలం ఓటేరుకు చెందిన తేజా రెడ్డితో తన కుమార్తెకు పరిచయం ఉన్నట్లు బాధితులు తెలుసుకున్నారు. తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి తనతో తీసుకెళ్లి ఉండవచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. తమ బిడ్డ ఆచూకీ తెలపాలంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సింగర్ స్మిత

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు, గాయని స్మిత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీ వారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డుప్రసాదాలతో సత్కరించారు.



మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు

తిరుపతి: కపిలేశ్వర స్వామివారి భోగితేరు ఊరేగింపులో పాల్గొన్న భక్తజన కోటి, దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, శివలింగాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు, భోగితేరులో కొలువై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకామాక్షి సమేత కపిలేశ్వరస్వామి






త్రిపురనాశక రక్షకుడు.. శివుడు..

సోమసూర్య అగ్నిలోచనుడు..
శ్వేతవృషభ వాహనుడు..
శూలబాణ భుజంగ భూషణుడు
అర్ధనారీశ్వరుడు.. లోకాలనేలేటోడు..
జగాలను కాసే జంగముడు..
చేతులెత్తి మొక్కిన వారిని కరుణించేవాడు
శివయ్యను దర్శించుకుని
భక్తులు పులకించిపోయారు.

- శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- తిరుపతి, చంద్రగిరిలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు

తిరుపతి కల్చరల్: జిల్లావ్యాప్తంగా మహా శివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తకోటితో శైవ క్షేత్రాలు కిక్కిరిశాయి. శివలింగాలకు విశేషంగా పూజలు చేసి శివపార్వతులను దర్శించుకున్నారు. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. అన్ని శివాలయాల్లో ప్రత్యేకంగా రుద్రాభిషేకం, పంచామృతం వంటి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మహా శివరాత్రి పర్వదినం నాడు ఉపవాసంతో రాత్రి జాగారం ఉంటే శివానుగ్రహం పొందుతామన్న నమ్మకంతో రాత్రంతా భక్తులు ఆలయాల్లోనే శివయ్య సేవలో తరించారు.

తిరుపతిలో మహాశివరాత్రి వేడుకలు

నగరంలోని శ్రీకపిలేశ్వరస్వామి, మంచినీరు గుంట వద్దనున్న కాశీవిశ్వేశ్వరస్వామి, దేవేంద్ర థియేటర్ సమీపంలో ఉన్న శ్రీకల్పనాంబిక నీలకంఠ స్వామి, ఎల్ఎస్ నగర్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో శివాలయాలకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కపిలేశ్వరుడి దర్శనానికి బారులు

శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి.




మంగళం: ఈశాన్యేశ్వర శివాలయంలో అభిషేకం, మంచినీళ్లగుంట వద్ద ఆలయంలో శివుడికి పజులు

శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 4.30 వరకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం 6 గంటల నుంచి దర్శనానికి అనుమతించగా వేలాదిమంది శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి భోగితేరు ఊరేగింపు నిర్వహించారు. సర్వాంగసుందర రూపులై శ్రీసోమస్కందమూర్తి సమేత శ్రీకామాక్షి అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

నంది వాహనంపై కపిలేశ్వరుడు..

శ్రీకపిలేశ్వరస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన నందివాహనంపై బుధవారం రాత్రి శ్రీకామాక్షి సమేత శ్రీకపిలేశ్వరస్వామి ఊరేగుతూ కటాక్షించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి నందివాహన సేవ అత్యంత వేడుకగా సాగింది. మంగళవాయిద్యాల నడుమ, స్వామివారు నంది వాహనదారుడై పురవీధుల్లో విహరించారు.

నేడు శివపార్వతుల కల్యాణం

శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు శివపార్వతుల కల్యాణం జరగనుంది.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి తాకిడి..

తిరుపతి సిటీ: స్థానిక మంచినీళ్ల గుంట వద్దగల శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శనం కోసం పోటెత్తారు.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని ప్రాచీన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణలతో పల్లెలన్నీ పులకించాయి. యోగిమల్లవరంలో పురాతన ఆలయం శ్రీపరాశరేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

తిరుపతి మంగళం : హర హర మహదేవ శంభోశంకర అంటూ శివ నామస్మరణతో జీవకోన, మంగళం ప్రాంతాల్లోని శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని జీవకోన జీవలింగేశ్వరస్వామికి, మంగళం తిరుమలనగర్‌లోని ఈశాన్యేశ్వర శివాలయం, మంగళం గ్రామంలోని జంబుకేశ్వరస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా రావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. జీవలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు అన్నా రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. అలాగే మంగళంలోని ఈశాన్యేశ్వర శివాలయంలో, జంబుకేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్న, తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ధ్యానారామంలో..

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీ ఆవరణలోని ధ్యానారామంలో శ్రీ బృహదీశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత రుద్రకమార్చన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వీసీ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కర్, డీన్ గోళి సుబ్రమణ్య శర్మ, అధ్యాపకులు, వర్సిటీ పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి (ముక్కోటి) ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 1.30 గంటలకు ఆలయ ఆవరణలోని అగస్త్య మహామునికి అభిషేకం చేశారు. అనంతరం మూలవిరాట్‌తో పాటు అమ్మవారికి రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రుడు అవతారంలో ఉన్న శివయ్యను దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. తిరిగి రాత్రి స్వామి, అమ్మవార్ల పురవీధుల్లో నంది వాహనంపై దర్శనమిచ్చారు. కొత్తపేటలో వెలసిన శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి (పుట్టాలమ్మ) ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

పాకాలలో..

పాకాల : మండలంలోని అన్ని శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మణి పిరెడ్డిపల్లిలోని శ్రీ కామాక్షి సమేత ఏకాంభరేశ్వరస్వామి ఆలయం, శంఖంపల్లి వద్ద ఉన్న అనంతరాయలగుడి, మద్దినాయనపల్లి సమీపంలోని మల్లీశ్వరస్వామి ఆలయం, గాంధీనగర్ గుట్టపైన శివాలయంతో పాటు పలు ఆలయాలను సుందరంగా అలంకరించారు.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులో వెలసిన శ్రీ మాణిక్యాంబ దేవి సమేత భీమేశ్వర స్వామి, నెమిలిగుండ్ల శివాలయం, బండకొండ శ్రీ సిద్ధేశ్వరస్వామి, కొమ్మిశెట్టివారిపల్లెలోని శ్రీ సిద్ధేశ్వరస్వామి, తుమ్మచేనుపల్లె గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో జీవకోన జీవలింగేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లు



కాశీ విశ్వేశ్వరస్వామి దర్శనం కోసం..



యోగిమల్లవరం శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ







జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు, పూజల్లో పాల్గొన్న భక్తులు, మంగళంలోని ఈశాన్యేశ్వర శివాలయంలో, చంద్రగిరి: రుద్రుడి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీఅగస్త్యేశ్వరస్వామిస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు









పాకాల:అలంకరణలో ఏకాంభరేశ్వరస్వామి, ఎల్ఎస్‌నగర్‌లోని ఆలయంలో శ్రీమల్లిఖార్జున స్వామి, ధ్యానారామంలో శివలింగానికి పూజలు, ప్రత్యేక అలంకరణలో ఆనందవల్లీ దేవి, చిన్నగొట్టిగల్లులో ఆదిదంపతుల కల్యాణం, మల్లీశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

సచివాలయాలు.. మందుబాబులకు నిలయాలు

- చంద్రగిరిలో పూర్తయిన సచివాలయాలు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోని వైనం
- ఆ సచివాలయాల వద్దే మందుబాబులు, గంజాయి బ్యాచ్‌ల వీరంగం
- నిఘా లేకపోవడంతో స్థానికుల్లో భయాందోళన




ప్రారంభానికి నోచుకోని నూకలబండ సచివాలయం, అక్కగార్లకాలనీలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయం వద్ద తాగిపడేసిన మద్యం సీసాలు

చంద్రగిరి: ప్రజల చెంతకు ప్రభుత్వం వెళ్లాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం నిర్మించిన సచివాలయాలు నేడు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి అత్యాధునిక హంగులతో నిర్మించిన సచివాలయాలను ప్రారంభించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. దీంతో సచివాలయాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తూ మందుబాబులు, గంజాయి మత్తులో యువకులు రెచ్చిపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్కగార్ల కాలనీలో రెచ్చిపోతున్న ఓ బ్యాచ్

అక్కగార్లకాలనీ సమీపంలోని బాలాజీ నగర్‌లో సచివాలయం, హెల్త్ క్లినిక్ నిర్మించారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సాయంత్రం 7 గంటలు దాటితో అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు కొదవలేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు మద్యం సేవిస్తుండగా, గంజాయి మత్తులో యువకులు తరచూ గొడవలు చేస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారంటూ వాపోతున్నారు. పలుమార్లు పోలీసులు, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి ముహూర్తం ఎప్పుడో..!

నూకలబండ, కొత్తపేట గ్రామాల పరిధిలో గత ప్రభుత్వ హయాంలోనే నూతన సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూకలబండ వద్ద కొంతమంది యువకులు మద్యం సేవించి బాటిళ్లను అక్కడే పగలగొడుతున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేటలోని సచవాలయ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి కళావిహీనంగా మారింది. కళ్లెదుటే ప్రజాసేవకు ఉపయోగించాల్సిన భవనాలు శిథిలమవుతున్నాయంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకొస్తాం

పట్టణంలో రెండు సచివాలయ నిర్మాణాలు పూర్తయ్యాయి. మరొక సచివాలయం నిర్మాణ దశలో ఉంది. ప్రస్తుతం పూర్తయిన భవనాల్లో సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటాం. భవనాలను పరిశీలించి వెంటనే వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. – **శేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, చంద్రగిరి**

బస్టాండ్‌లో భక్తుల రద్దీ



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో తిరుపతి బస్టాండ్ పోటెత్తింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు తిరుపతి బస్టాండ్‌లో తలకోనతో పాటు శ్రీకాళహస్తి సర్వీసులు ప్రయాణికులతో నిండిపోయాయి. రద్దీని గుర్తించిన జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు తలకోన, శ్రీకాళహస్తి ప్లాట్‌ఫాంలతోపాటు బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో తోపులాటలకు తావులేకుండా చర్యలు చేపట్టారు. అయితే తిరుపతి డిపోకు చెందిన పలు పల్లెవెలుగు సర్వీసులను శివరాత్రి ఉత్సవాలకు వేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

బస్సుపాస్ దారి మార్పునకు పరిశీలన

తిరుపతి బస్టాండ్ పరిధిలోనే ఏడుకొండల బస్టాండ్ వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సుపాస్ కౌంటర్ వద్ద నీడ లేకపోవడంతో పాటు ఆ మార్గంలో ఆర్టీసీ సర్వీసులు నిత్యం తిరుగుతుంటాయి. ఈ క్రమంలో దారి మార్పు చేయడానికి డీపీటీఓ నరసింహులతో పాటు ఏటీఎం డీఆర్‌నాయుడు పరిశీలన చేశారు. బస్టాండ్‌లోనే బస్సుపాస్‌లు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

సర్వరోగ నివారిణి యోగా




హాజరైన ప్రముఖులు, నగర ప్రజలు, ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక గురువు ఆత్మానందమయి

తిరుపతి సిటీ: ఆరోగ్య సంరక్షణలో సర్వరోగ నివారిణిగా యోగాధ్యానం పనిచేస్తుందని ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు శ్రీశ్రీశ్రీ ఆత్మానందమయి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఎస్వీయూ స్టేడియం వేదికగా దివ్యబాబాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుషుమ్న క్రియా మహాధ్యానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి యోగాధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మానవజీవితంలో సుషుమ్న క్రియా యోగ సాధన కీలకమని, ఆధ్యాత్మికంగా, ఆరోగ్య సంరక్షణిగా పనిచేస్తుందన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకోగల శక్తి యోగాకు ఉందని, శరీర రుగ్మతల నుంచి మానవునికి విముక్తిని కల్పించి ప్రశాంతతను కలుగజేసేందని చెప్పారు. వ్యక్తి నైపుణ్యాన్ని పెంపొందించడంలో సుషుమ్న క్రియా యోగాధ్యానం ఉపకరిస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సుషుమ్న క్రియా యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె ఆధ్వర్యంలో సుషుమ్న క్రియా యోగ దీక్ష, మహా లింగ బిల్వార్చన, సుస్వర భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు, మహా లింగోద్భవ ధ్యానం, రుద్రాక్ష వితరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాంతా బయోటెక్ వర ప్రసాద్ రెడ్డి, ఎస్వీయూ వీసీ అప్పారావు, నగరప్రముఖులు, వేల సంఖ్యలో నగరవాసులు, యోగా గురువులు పాల్గొన్నారు.